ఏళ్లనాటి సమస్యకు పరిష్కారం



చినగొల్లపాలెంలో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది



నూతన విద్యుత్ వైర్లును లాగుతున్న సిబ్బంది

- మంత్రి జోగి రమేష్ చొరవతో తొలగిన విద్యుత్ వైర్ల సమస్య
- ఉప్పుటేరుపై కేబుల్‌కు రూ. 26 లక్షలతో ప్రతిపాదన
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

కృత్తివెన్ను: చినగొల్లపాలెం బీసీ బాలికల వసతిగృహం వద్ద విద్యుత్ తీగలు చేతికి అందేంత ఎత్తులో ఉండి ప్రమాదకరంగా మారాయి. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా పెనుప్రమాదం తప్పదు. ఎన్నో ఏళ్లుగా ఈ సమస్యతో ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా ఫలితం లేదు. ఇటీవల చినగొల్లపాలెం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ పాల్గొన్న ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పెనుమాల సునీల్‌తో పాటు స్థానికులు విద్యుత్ తీగల సమస్యను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై మంత్రి జోగి రమేష్ వెంటనే స్పందించారు. సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. దీంతో ఏళ్ల తరబడి ఉన్న సమస్యకు పరిష్కారం లభించింది.

విద్యుత్ శాఖ నిధులతో...

మంత్రి ఆదేశాలతో విద్యుత్ శాఖ ఎస్ఈ ఎ. మురళీమోహన్ ఇతర అధికారులతో కలిసి క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. సమస్యను గుర్తించి రూ. 3.5 లక్షల విద్యుత్ శాఖ నిధులతో పనులు ప్రారంభించారు. సమస్య పరిష్కారానికి గాను 12 నూతన విద్యుత్ స్తంభాలను, 350 మీటర్ల కొత్త వైర్లను వినియోగించారు. దీంతో విద్యుత్ తీగలు కిందికి వేలాడే సమస్య పరిష్కారమైంది. దీవిలో నెలకొన్న మరికొన్ని విద్యుత్ సమస్యలను సైతం పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఉప్పుటేరుపై కేబుల్‌కు రూ. 26 లక్షలతో ప్రతిపాదనలు పంపారు.

చాలా సంతోషంగా ఉంది



ఎన్నో ఏళ్లుగా విద్యుత్ వైర్ల సమస్య అపరిష్కృతంగా ఉంది. బాలికల హాస్టల్ సమీపంలో వైర్లు చేతికి అందేంత ఎత్తులో వేలాడాయి. భయం నీడలో గ్రామస్తులు గడపాల్సి వచ్చేది. సమస్యను ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వంలో మంత్రి జోగి రమేష్‌కు తెలియజేశాం. ఆయన వెంటనే స్పందించి విద్యుత్ శాఖాధికారులకు ఆదేశాలిచ్చారు. అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సమస్యను పరిష్కరించారు. చాలా సంతోషం.

పెనుమాల సునీల్, సర్పంచ్, చినగొల్లపాలెం

చెప్పిన వెంటనే సమస్య పరిష్కారం



స్థానికంగా ఉన్న తీవ్రమైన సమస్యను మంత్రి జోగి రమేష్‌కు విన్నవించిన వెంటనే పరిష్కారం చూపడం ఆనందంగా ఉంది. విద్యుత్ తీగల సమస్యను పరిష్కరించడమే కాకుండా పడతడిక, చినగొల్లపాలెం గ్రామాల మధ్య ఉప్పుటేరుపై ఉన్న విద్యుత్ తీగలు వేలాడకుండా ఉండేందుకు రూ. 26 లక్షలు విద్యుత్ శాఖ నిధుల నుంచి 2 కిలోమీటర్లు మేర కేబుల్ ప్రతిపాదనలు సైతం పంపడం సంతోషం.

కె. బాపూజీ, మాజీ సర్పంచ్ చినగొల్లపాలెం

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో సూర్యనారాయణ స్వామి కల్యాణం



అవనిగడ్డ: మండల పరిధి వేకనూరులోని సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం స్వామివారి కల్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. లంక వెంకట గోపాలకృష్ణమూర్తి-వెంకట రాజ్యలక్ష్మి దంపతులు స్వామి వారి కల్యాణం జరిపించారు. అంబటి భరత్‌రామ్ అన్నప్రసాద కార్యక్రమానికి ఆర్థిక సాయం అందించారు. ఆలయ ధర్మకర్త తుంగల వీర వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

12 మంది రైతులకు ఆవుల అందజేత



మచిలీపట్నంటౌన్: నగరంలోని దేశాయిపేట బృందావన్ గో సంరక్షణ సంఘంలోని 12 ఆవులను ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు ఆదివారం అందజేశారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు 20 దేశీ ఆవులను ఇచ్చేందుకు గో సంరక్షణ సంఘం కమిటీ తీర్మానించటంతో ఈ ఆవులను రైతులకు అందజేశారు. మచిలీపట్నం, పామర్రు, పెడన మండలాలకు చెందిన రైతులకు ఆవులను అందజేశారు. కార్యక్రమంలో గో సంరక్షణ సంఘం అధ్యక్షుడు గున్నయ్యశెట్టి, శేఖర్, ఓ స్వామిబాబు, రామ్మోహన్, ప్రసాద్, సుబ్రహ్మణ్యం, లోకనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ తప్పనిసరి

పెడన: మండలంలో ఈ క్రాప్ వంద శాతం పూర్తయిందని, ఈకేవైసీ 50 శాతం మాత్రమే అయిందని, మిగిలిన రైతులు తమ సమీపంలోని ఆర్బీకేలలో ఈకేవైసీ చేయించుకోవాలని ఏఓ జీవీ శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు సెల్‌ఫోన్‌కు వచ్చే ఓటీపీ ద్వారా ఈకేవైసీ పూర్తవుతుందన్నారు. ఈకేవైసీ పూర్తయితేనే రైతులు ప్రభుత్వం నుంచి పొందే రైతు భరోసా, సబ్సిడీ పరికరాలు, యంత్రాలు, ఎరువులు, విత్తనాలు తీసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. అలాగే పండించిన ధాన్యం విక్రయించేందుకు కూడా ఈకేవైసీ చేయించుకోవాల్సిందేనని, ఈకేవైసీ అయితేనే రైతులకు అన్ని విధాలుగా ఉపయోగకరంగా ఉంటాయన్నారు. 19,562 ఎకరాలు ఈ క్రాప్ పూర్తయిందని చెప్పారు. ఇందులో 50 శాతం మాత్రమే ఈకేవైసీ పూర్తయిందని తెలిపారు. వాస్తవంగా ఈనెల 9వ తేదీతో గడువు ముగుస్తున్నందున రైతులు తక్షణం స్పందించి మీ సమీపంలోని రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి వీఏఏలను లేదా ఎంపీఈఓలను కలిసి ఈకేవైసీ చేయించుకోవాలని ఆయన కోరారు.

పేద విద్యార్థులకు సాయం



చల్లపల్లి: పేద విద్యార్థులకు ఎంఏ ఖాదర్‌ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.75 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఆదివారం ట్రస్ట్ ప్రతినిధి, విశ్రాంత ఉపాధ్యాయులు మహ్మద్ జహీరుద్దీన్ ఇంటి వద్ద పది మంది పేద విద్యార్థులకు రూ.75 వేలు ఆర్థిక సాయం చేశారు. గ్రామంలోని ఎస్సార్‌వైఎస్సీ హైస్కూల్, జెడ్పీ హైస్కూల్, ప్రభుత్వ ఎంపీపీ ఉర్దూ పాఠశాల, విజయా హైస్కూల్‌లో చదువుతున్న పేద విద్యార్థులకు ఈ సహాయం అందజేశారు. ట్రస్ట్ కార్యదర్శి మహ్మద్ నసీరుద్దీన్ మాట్లాడుతూ చల్లపల్లిలో చదువుకున్న ఖాదర్‌ఖాన్ జ్ఞాపకార్థం ఆయన కుమారులు అమెరికాలో ఉంటున్నప్పటికీ, చల్లపల్లిలో పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేయాలనే తలంపుతో తండ్రి పేరు మీద ఐదేళ్లుగా పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందిస్తున్నారని తెలిపారు.

మృతుడి కుటుంబానికి సాయం అందజేత



కోనేరుసెంటర్: కానూరు పీఏసీఎస్ సభ్యుడు, జొన్నలవారిమోడి గ్రామానికి చెందిన చెన్నంశెట్టి రఘుపతి వారం రోజుల కిందట మృతిచెందాడు. రూ. 10 వేలను మట్టి ఖర్చుల నిమిత్తం మృతుని భార్య అన్నపూర్ణమ్మకు ఆదివారం బ్యాంకు అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం నాయకుడు శ్రీకాకుళపు నాగేశ్వరరావు అందజేశారు. కానూరు గ్రామానికి చెందిన గణపాబత్తుల వీరకోటేశ్వరరావు మరణించగా అతని భార్య నాగమణికి రూ. 10 వేలను అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి అడపా శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గణపతి బొప్పా.. మోరియా



నిమజ్జనం ఊరేగింపులో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, వికాస్

అవనిగడ్డ: స్థానిక ఆరో వార్డులో గరల్స్ హైస్కూల్ ఎదురుగా ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహానికి అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ప్రత్యేక పూజలు చేశారు. గణేష్ నిమజ్జనాన్ని పురస్కరించుకుని పూజల అనంతరం ఎమ్మెల్యే సింహాద్రి, ఆయన తనయుడు, వైఎస్సార్ సీపీ యువనేత సింహాద్రి వికాస్ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం స్థానిక పంచాయతీ పరిధిలోని పలు ప్రాంతాల్లో గణపతి విగ్రహాన్ని ఊరేగించారు. అనంతరం కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన డప్పు విన్యాసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమాన్ని జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, వైఎస్సార్ సీపీ యూత్ నాయకులు చింతలపూడి బాలు, ఉత్సవ కమిటీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



రోడ్డు అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న ఎంపీపీ, మాజీ వైస్ ఎంపీపీ

గన్నవరం: స్థానిక శ్రీమల్లికార్జున హైస్కూల్ నుంచి రాజీవ్ నగర్ కాలనీ వరకు ప్రధాన రహదారి అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. మండల పరిషత్, బుద్దవరం గ్రామ పంచాయతీ సంయుక్త నిధులు రూ.32 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. మొత్తం 350 మీటర్లు పొడవు, 4.5 మీటర్లు వెడల్పున రహదారి నిర్మిస్తున్నారు. గన్నవరం నుంచి రాజీవ్‌నగర్ కాలనీకి వెళ్లే బీటీ రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ప్రజల విజ్ఞప్తిపై స్పందించిన ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ ఇటీవల శంకుస్థాపన చేశారు. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో పది రోజుల క్రితం రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. రహదారిని కొంత మేర మెరక చేసిన తర్వాత సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ రహదారికి అనుసంధానంగా మరో రూ.8 లక్షలతో సీసీ రోడ్డును కూడా నిర్మాణం చేస్తున్నారు. ఈ రోడ్ల నిర్మాణం పూర్తికావస్తుండడంతో ఈ ప్రాంత ప్రజల కష్టాలు తీరనున్నాయి.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ



పుస్తకాలు స్వీకరించిన విద్యార్థులతో జెడ్పీటీసీ ఎలిజబెత్ రాణి, సిబ్బంది

గన్నవరం రూరల్: విజ్ఞాన సాధనకు పుస్తక పఠనం ఒక్కటే మార్గమని జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి అన్నారు. ఆదివారం మండలంలోని పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయానికి నీతి కథలు, స్టోరీ పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ కె.కృపానందం అధ్యక్షతన జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాల అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేశారని చెప్పారు. వేసవి శిక్షణా శిబిరాలు ఏర్పాటు చేయటం ద్వారా విద్యార్థులలోని సృజనను వెలికితీయడంతో పాటు, పుస్తక పఠనం పట్ల విద్యార్థుల్లో ఆసక్తిని పెంచారన్నారు. గ్రామస్తులు పార్థసారథి, వెంకట్రామయ్య, సుబ్బారావు, సీతారామయ్య, నాగభూషణం పాల్గొన్నారు.

మతాల్లోని మంచిని గ్రహించాలి

పామర్రు: మహమ్మద్ ప్రవక్త జీవితం అందరికీ ఆదర్శప్రాయమని జమాతె ఇస్లామీ రాష్ట్ర సలహా మండలి సభ్యులు మాయతుద్దీన్ అన్నారు. స్థానిక జమాతె ఇస్లామి హింద్ మహిళా విభాగం ఆధ్వర్యంలో మహ్మద్ ప్రవక్త ముహమ్మద్(స) జయంతి నెలను ఆదివారం ప్రారంభించారు. మాయతుద్దీన్ మాట్లాడుతూ పరిశీలనాత్మక దృష్టితో మహనీయుల జీవితాలను చదవాలని సూచించారు. అప్పుడు మాత్రమే అన్ని మతాల్లోని మంచిని గ్రహించగలమని పేర్కొన్నారు. కార్యక్రమానికి యూనుస్ అధ్యక్షత వహించగా, పామర్రు ఎంఈవో-2 పద్మవాణి, స్థానికులు రాజేశ్వరి, శ్రావణి, తహసిన్ అస్మా, మున్నీ, అమ్మారా, మల్లిక పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

బంటుమిల్లి: స్థానిక దళితవాడకు చెందిన నేతల ప్రేమ్‌కుమార్ (25) విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కృత్తివెన్ను మండలం మునిపెడ గ్రామ సమీపంలోని మిలేష్ ఆక్వా కంపెనీలో పనిచేస్తున్న ప్రేమ్‌కుమార్ సెప్టెంబర్ 25వ తేదీన విధులు ముగించుకుని తిరిగి ఇంటికి వెళుతుండగా రోడ్డు మార్జిన్‌లో నిలిపి ఉంచిన ట్రాక్టర్ ట్రక్కును ఢీ కొని తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని చికిత్స నిమిత్తం మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి, అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తలకు బలమైన గాయం కావడంతో పరిస్థితి విషమించి క్షతగాత్రుడు చికిత్స పొందుతూ మరణించాడు. ఆస్పత్రి వర్గాల సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకునికి తీవ్ర గాయాలు



బంటుమిల్లి: స్థానిక గాంధీ మండపం సెంటర్‌లో తీవ్ర గాయాలతో రోడ్డుపై పడి ఉన్న యువకుడిని స్థానికులు ఆదివారం గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. యువకుడి తలకు బలమైన గాయమై తీవ్ర రక్తస్రావం కావడంతో బాధితుడిని 108 వాహనంలో మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని, ప్రమాదానికి గల కారణాలను విచారణ చేస్తున్నామని ఎస్ఐ పైడిబాబు తెలిపారు.

చిత్తులాట ఆడుతున్న ఐదుగురి అరెస్ట్

ఘంటసాల(అవనిగడ్డ): స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని ఘంటసాల జగనన్న కాలనీలో చిత్తులాట ఆడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేశామని ఎస్ఐ కూచిపూడి శ్రీనివాస్ తెలిపారు. చిత్తులాట సమాచారం తెలుసుకున్న వెంటనే దాడిచేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.1,660 నగదును స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో ఎవరన్నా పేకాట, చిత్తులాట, కోడిపందేలు వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

రూ.13 లక్షలతో అంగన్‌వాడీ భవన నిర్మాణం

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో నాడు-నేడు కార్యక్రమంలో అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ స్కూల్‌గా మార్పు చేసి వాటికి నూతన భవనాలను నిర్మిస్తోంది. అందులో భాగంగా నున్న గ్రామం శాలివాహన బజారులో రూ.13 లక్షలతో భవనాన్ని నిర్మిస్తున్నారు. విద్యార్థులకు ఒక తరగతి గది, హాలు, నిత్యావసర వస్తువులను నిల్వ చేసేందుకు స్టోర్, వంటగది, ఉండేలా నిర్మాణం చేస్తున్నట్లు గ్రామ పంచాయతీ సర్పంచి కాటూరి సరళ, కార్యదర్శి జీటీవీ రమణ తదితరులు తెలిపారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

మోపిదేవి: మెరకనపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహిస్తారని గ్రామ కార్యదర్శి రామకోటేశ్వరరావు తెలిపారు. అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు శిబిరాన్ని ప్రారంభిస్తారని చెప్పారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిబిరం జరుగుతుందన్నారు.

నేడు ఉల్లిపాలెంలో..

కోడూరు: ఉల్లిపాలెం సచివాలయం పరిధిలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహిస్తామని ఎంపీడీఓ శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. ఉల్లిపాలెం ఎంపీయూపీ పాఠశాల ఆవరణలో నిర్వహించనున్న కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన వైద్య నిపుణులు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తారని చెప్పారు. ఉల్లిపాలెం, హంసలదీవి పంచాయతీల ప్రజలు శిబిరంలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

19 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత



పెనమలూరు: కానూరులో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు ఆదివారం పట్టుకున్నారు. తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య తెలిపిన వివరాల ప్రకారం.. కానూరు కొత్త ఆటోనగర్‌లో 19 టన్నుల రేషన్ బియ్యాన్ని లారీలో అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారంతో రెవెన్యూ, సివిల్ సప్లయీస్ అధికారులు దాడులు చేసి లారీని పట్టుకున్నారు. లారీలో 19 టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వారిపై క్రిమినల్ కేసు నమోదు చేస్తామని తహసీల్దార్ వెంకటశివయ్య తెలిపారు.

15 నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు



అద్దంకి నాంచారమ్మ అమ్మవారు

కోడూరు: కృష్ణానదిలో భక్తుల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ అమ్మవారి ఆలయంలో ఈ నెల 15వ తేదీ నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తామని ఆలయ ఈఓ పామర్తి సీతారామయ్య ఆదివారం తెలిపారు. 15 నుంచి 23వ తేదీ వరకు జరిగే ఉత్సవాల్లో ప్రతి రోజూ అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారని చెప్పారు. 15న విశ్వనాథపల్లి భక్త సమాజంచే భజన కార్యక్రమం, 16న గుడివాడకు చెందిన పాదర్తి సిస్టర్స్ శిష్య బృందంచే జానపద, కూచిపూడి నృత్య ప్రదర్శన, 17న గుంటూరు రాధామాదవ నాట్యక్షేత్రానికి చెందిన కళాకారులచే భరతనాట్య ప్రదర్శన, 18న విశ్వనాథపల్లి అభయాంజనేయ బృందంచే మురళీకృష్ణ కోలాటం, 19న జరుగువానిపాలెం శ్రీనివాసభక్త సమాజం సభ్యులచే భజన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. 20న వి.కొత్తపాలెంకు చెందిన సీతారామాంజనేయ భక్తసమాజం సభ్యుల మురళీ కోలాటం, భజన కార్యక్రమం, 21న చినముత్తేవి వేణుగోపాల భక్తసమాజం సభ్యులతో అమ్మవారి గాన కచేరీ, 22న నూరగం రామకృష్ణ ఆధ్వర్యంలో రేలారే-రేలా జానపద కళాకారులతో గీతాలు, నృత్య ప్రదర్శనలు జరుగుతాయని ఈఓ వివరించారు. 23న శమీవృక్ష పూజ, అనంతరం కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామివారి ఊరేగింపు నిర్వహిస్తామని చెప్పారు.

కార్తికేయుని ఆలయంలో భక్తుల రద్దీ



మోపిదేవి: మోపిదేవి వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి ఆలయం భక్తులతో కోలాహలంగా మారింది. ఆదివారం సెలవుదినం కావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజలతో పాటు పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కళకళలాడింది. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగళ్లశాల వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది. ఆలయ ఏసీ ఎస్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ సూపరింటిండెంట్ బొప్పన సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఉపాధ్యాయులకు సత్కారం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సంఘ ప్రతినిధులు

పెనమలూరు: అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పలువురు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఆంధ్రప్రదేశ్ అన్ ఎయిడెడ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్స్ (ఏపీపీయూఎస్ఎంఏ) ఆధ్వర్యంలో ఆదివారం తాడిగడపలో జరిగిన కార్యక్రమంలో జిల్లా స్థాయిలో ఉత్తమ సేవలు అందించిన దాదాపు 20 మంది ఉపాధ్యాయులను సంఘం ప్రత్యేకంగా సన్మానించింది. పెనమలూరుకు చెందిన వికాసస్ పాఠశాల ఉపాధ్యాయుడు పెండ్యాల రాజేష్, జ్యోతి కాన్వెంట్ ప్రిన్సిపాల్ రాజులపాటి ఆదిశేషులను కమిటీ ఘనంగా సన్మానం చేశారు. సమాజంలో ఉపాధ్యాయులు పాత్రచాలా కీలకమని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు కె.సాంబశివరావు, నరేంద్రకుమార్, వై.విజయ్‌కుమార్, ఆర్ఎస్ఎన్ ప్రసాద్, కేఆర్ఎస్.రావు, చిగురుపాటి వివేకానంద పలువురు పాల్గొన్నారు.

- గుడివాడ టౌన్:ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం 250 మంది వాకర్స్‌కి హెల్త్ ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం వాకర్స్‌కు ఉచితంగా న్యూట్రిషియన్ హెల్త్ డ్రింక్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు అర్జా ప్రసాదు, కార్యదర్శి వంగ పండు బ్రహ్మాజీ, కోశాధికారి డి.రామకృష్ణ, సభ్యులు ఎల్ఈ వెంకటేశ్వరరావు, కె.రామకృష్ణ, జె.వెంకటేశ్వరరావు, బొగ్గారపు తిరుపతయ్య పాల్గొన్నారు.





బందరులో భారీ వర్షం

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నంలో ఆదివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. దాదాపు అరగంట పాటు కుండపోత వర్షం కురవడంతో నగరంలోని ప్రధాన రహదారితో సహా లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. డ్రెయిన్లలో నీరు రోడ్లపై నీరు పారింది. ప్రధాన రహదారిలో రాకపోకలు సాగించేందుకు పాదచారులు, వాహనదారులు ఇక్కట్లకు గురయ్యారు. కోనేరు సెంటర్‌తో పాటు బస్టాండ్ ఆవరణలో వర్షం నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు.